జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల -పెద్దపల్లి
ఆదివారం 05-10-2025 పేజీలు : 5



# దసరా జోష్..

- ఒక్క రోజులో రూ. 1.49 కోట్ల మద్యం అమ్మకాలు
- సెప్టెంబరు నెలలో రూ. 7.18 కోట్ల విక్రయాలు

జగిత్యాల, అక్టోబరు 4:

దసరా జోష్ అంతా ఇంతా కాదు.. ఈ యేడాది విజయదశమి వేడుకల్లో సంతోషా ల్లో మునిగేందుకు జనం ఎలాంటి ఖర్చుకూ వెనుకాడలేదు. జిల్లావ్యాప్తంగా దసరా సంబురాలకు ఏకంగా రూ. 30 కోట్లపైగానే వ్యయం చేసినట్లు అంచనా ఉంది. ప్రధా నంగా మద్యం, మాంసం అమ్మకాలతో పాటు నూతన వస్త్రాలు, ఎలక్ట్రానిక్స్, మిఠా యిలు, తదితర ఆడంబరాల కొనుగోళ్లకు పెద్ద ఎత్తున ఖర్చు చేశారు. జిల్లాలోని మద్యం దుకణాల్లో ఈనెల 1వ తేదీన ఒక్క రోజు మాత్రమే రూ. 1,49,30,648 విలువ గల మద్యం కొనుగోళ్లు జరిగినట్లు ఎక్సైజ్ వర్గాలు తెలిపాయి. ఇందులో 1,112 లిక్కర్ బాక్సులు, 3,045 బీర్ బాక్సులు విక్రయం అయినట్లు ఎక్సైజ్ శాఖ రికార్డులు తెలుపుతున్నాయి. గత సెప్టెంబరు నెలలో రూ. 7.18 కోట్ల విలువ గల 58,849 లిక్కర్ బాక్సులు, 1,21,381 బీర్ బాక్సులను మందు బాబులు కొనుగోలు చేశారు. ఈనెల 2వ తేదీన దసరా రోజున గాంధీ జయంతి ఉండడంతో జిల్లాలో లిక్కర్ అమ్మకాలు జరపలేదు. అయితే పలు బెల్టు దుకాణాలు, ఇతర ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరిగాయి. దసరా సందర్భంగా మాంసం అమ్మకాలకు పెద్ద పీట ఉంటుంది. గాంధీ జయంతి కారణంగా పలు ప్రాంతాల్లో మాంసం విక్రయాలు జరగనప్పటికీ, అధికారుల కళ్లుగప్పి పలువురు వ్యాపారులు చాటుమాటున మాంసం విక్రయాలు జరిపారు. జిల్లాలో సుమారు 200కు పైగా చికెన్, 50 వరకు మటన్ దుకణాలు ఉండగా జిల్లా మొత్తంగా అనధికారికంగా సుమారు 300లకు పైగా మాంసం దుకాణాలున్నాయి. గ్రామాలు, పట్టణాలు కలిపి వేల సంఖ్యలో మేకలు, మేక పోతులు, గొర్రె పోతులు (యాటలు) తెగినట్లు తెలుస్తోంది.



## మత్తు పదార్థాల అనర్థాలపై విస్తృత ప్రచారం చేయాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



ఉమ్మడి కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):

మత్తు పదార్థాల అనర్థాలపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో నిర్వహించవలసిన వివిధ కార్యక్రమాలపై మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు.

మిగతా 3లో...

## మహిళలు,విద్యార్థినిలు సమస్య ఉంటే సంప్రదించండి

జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపిఎస్



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి) విద్యార్థినులు,మహిళలు వేధింపులకు గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గారు భరోసా ఇచ్చారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లాలో షీ టీమ్ బృందం విద్యాసంస్థల్లో,మహిళలు పని చేసే ప్రదేశాల్లో ర్యాగింగ్,ఇవిటీజింగ్,పొక్సొ,షీ టీమ్స్, మహిళ చట్టలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

మిగతా 4లో...

## మోదీ సాహసోపేత నిర్ణయాలతో సురక్షితంగా దేశం

- -కాంగ్రెస్ పార్టీని బొందపెట్టడానికి ప్రజలు సిద్ధం..
- -స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుస్తాం..
- -బిజెపి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి..



పెద్దపల్లి జిల్లాప్రతినిధి అక్టోబర్04(ప్రజాజ్యోతి): భారతువైపు శత్రుదేశాలు కన్నెత్తి చూడటానికే భయపడేలా చేసిన దేశప్రధాని నరేంద్రమోదీ చేతుల్లో దేశం సురక్షితంగా ఉందని మోదీ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలే దేశాన్ని బలమైనశక్తిగా నిలబెట్టాయని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఉద్ఘాటించారు.

మిగతా 4లో...

# సింగరావుపేట గ్రామంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

## -వెళ్లి రా గౌరమ్మ ,మళ్ళీ రా గౌరమ్మ అంటూ ఉత్సహాం గా బతుకమ్మా ఆడుకున్న మహిళలు



**జగిత్యాల రూరల్ ,అక్టోబర్ 04, ప్రజాజ్యోతి:** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం సింగరావుపేట గ్రామంలో సద్దుల బతుకమ్మపండుగ వేడుకలను2025 అక్టోబర్ 04 శనివారం రోజు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రంగురంగుల పూలనుకోసుకొచ్చి బతుకమ్మను పేర్చి ఇంట్లో గౌరీమాతను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా ఉయ్యాలలు ఊగుతూ, నృత్యాలు చేస్తూ భాజా భజంత్రీలు నడుమ కోలాటాలు, భజనలు చేస్తూ బతుకమ్మ లను బతుకమ్మ ప్రాంగణాలకు చేర్చారు. మహిళలంతా ఒక్కచోట చేరి ఉయ్యాలలు ఊగుతున్న దృశ్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు చిహ్నంగా మహిళలు కొలిచే సద్దుల బతుకమ్మ పండుగను జగిత్యాల జిల్లా రాయికల్ మండలం సింగరావుపేట గ్రామంలో శనివారం రోజున మహిళలు కన్నుల పండుగలా జరుపుకున్నారు. మహిళలు తంగేడు, గునుగ, పట్టకుచ్చు, తీరొక్క పూలతో అందంగా పేర్చిన మధ్యలో గౌరమ్మను ఉంచిన బతుకమ్మలను గ్రామంలోని ప్రధాన కూడళ్ళల్లో ఉంచి బతుకమ్మ, కోలాటాలు ఆడారు.డి జే సౌండ్స్ లేకుండా సంప్రదాయం గా ఆడి పాడగా అదీ చూపరు లను ఆకట్టుకుంది. అనంతరం మహిళలు బతుకమ్మలతో సామూహికంగా తరలివెళ్ళి కుంటలో పోయిరా గౌరమ్మ.. పోయిరా.. అంటు పాడుతూ నిమజ్జనం చేశారు. అనంతరం మహిళలు సత్తిపిండిని ఒకరికి ఒకరు అందించుకొనిబతుకమ్మశుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈకార్యక్రమంలో మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# లండన్‌లో గుండెపోటుతో జగిత్యాల జిల్లా మెడిపల్లి మండల వాసి మృతి



**జగిత్యాల,అక్టోబర్ 04, ప్రజాజ్యోతి:** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్ రెడ్డి కుమారుడు ఏనుగు మహేందర్ రెడ్డి రెండు సంవత్సరాల క్రితం పిజి చేసేందుకు లండన్‌కు వెళ్లాడు పిజి పూర్తి చేసిన అనంతరం సదరు విద్యార్థికి వర్క్ వీసా కూడా వచ్చింది తను రూమ్ లో ఉండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మహేందర్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందాడని పరీక్షించిన వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలిసిన మృతుడి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్థులు నంతావంతెలిపారు. దమ్మన్నపేటలో విషాదచాయలుఅలుముకున్నాయి.

# రాజకీయ పార్టీల మాటల యుద్ధం




**చొప్పదండి, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** చొప్పదండిలో శనివారం ఒక ఛానల్ ఆధ్వర్యంలో చర్చ వేదిక కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్, బి ఆర్ఎస్,బిజెపి నాయకులు చర్చా వేదికలో పాల్గొన్నారు. బిజెపి నాయకులు మాట్లాడుతూ సెంట్రల్ లైటింగ్ పనులు నత్త నడకన సాగుతున్నాయని, సమీకృత మార్కెట్ ప్రారంభించడం లేదని ఆరోపించారు. తమ హాయంలో ప్రారంభించిన పనులే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని బిఆర్ఎస్ నాయకులు విమర్శించారు. అభివృద్ధి,సంక్షేమం ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తున్నదని కాంగ్రెస్ నాయకులు చెప్పారు.

# మహిళను చంపుతానని బెదిరించిన వ్యక్తి పై కేసు నమోదు

**ఎస్ఐ రాహుల్ రెడ్డి.... ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 4( ప్రజా జ్యోతి)** ఎల్లారెడ్డిపేట మండలంలోని దూమాల గ్రామానికి చెందిన చేకూరు మంజుల తన గ్రామ శివారులోని హైస్కూల్ ముందు 242 గజాల భూమి ఉంది ఆ భూమిలో గ్రామపంచాయతీ అనుమతితో ఇంటి నిర్మాణ పనులు ఏర్పాటు చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన చెరుకు రాజేశం తండ్రి బుచ్చయ్య పాత కక్షలు పెట్టుకొని శుక్రవారం మూడు గంటల ప్రాంతంలో ఇంటి నిర్మాణం చేయకూడదని నానా బూతులు తిడుతూ, చంపుతానని బెదిరించడానికి మంజుల ఎల్లారెడ్డిపేట పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం రాజేష్ పై కేసు నమోదు చేసినట్టు ఎల్లారెడ్డిపేట ఏస్తే రాహుల్ రెడ్డి తెలిపారు.

# ముస్తాబాద్ జెడ్పి పీఠంపై కాషాయ జెండా ఎగరవేస్తాం

## మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్



**ముస్తాబాద్ అక్టోబర్ 4( ప్రజా జ్యోతి ):**స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్తాబాద్ మండల పరిషత్ మీద కాషాయం జెండా ఎగురవేసే దిశగా కార్యకర్తలు పనిచేయాలని మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ అన్నారు .ముస్తాబాద్ ఏ ఎం ఆర్ గార్డెన్ లో జరిగిన ఎం పి టి సి జెడ్పిటిసి ఎన్నికల ప్రభారీలు మరియు బూత్ అధ్యక్షులు ఆ పై స్థాయి నాయకుల సమావేశంలో నియమావళి అభ్యర్థుల యొక్క జాబితా రిజర్వేషన్లు పరిశీలన ఎన్నికలకు సంసిద్ధం చేసే దిశగాచర్చించారు భారతీయ జనతా పార్టీ అన్ని సీట్లలో పోటీ చేసి సీట్లు సంపాదించే దిశగా ముందుకు వెళుతుందని అందుకు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి కేంద్రం నిధులతోనే అనే ఉదాహరణతో చెప్పారు.ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ప్రభారి దేవసాని కృష్ణ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి బుచ్చెల్లి మహేశ్వరి, చిట్టినేని శ్రీనివాసరావు మీసా శంకర్ ,సరదాని నందం, కామటి పద్మ బెదుర ప్రశాంత్ కాసోడి రమేష్, చీకోటి మహేష్, కరెడ్ల రమేష్ రెడ్డి, కస్తూరి కార్తీక్ రెడ్డి, వరి వెంకటేష్ ,కోల కృష్ణా, నాంపల్లి కనకయ్య, శక్తి కేంద్ర ఇన్చార్జీలు బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఆడపడుచుల సద్దుల బతుకమ్మ



**మెట్ పల్లి, అక్టోబర్ 4, ప్రజాజ్యోతి:** పట్టంములోని సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల పూలను కోసుకొచ్చి బతుకమ్మను పేర్చి ఇంట్లో గౌరీమాతను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా నడుమ కోలాటాలు చేస్తూ బతుకమ్మ లను బతుకమ్మ ఘాటు వద్దకి చేర్చారు. మహిళలంతా ఒక్కచోట చేరిన దృశ్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు చిహ్నంగా మహిళలు కొలిచే సద్దుల బతుకమ్మ పండుగను పట్టణం లో మహిళలు కన్నుల పండుగలా జరుపుకున్నారు. మహిళలు తంగేడు, గునుగ, పట్టకుచ్చు, తీరొక్క పూలతో అందంగా పేర్చిన మధ్యలో గౌరమ్మను ఉంచిన బతుకమ్మలను గ్రామంలోని ప్రధాన కూడళ్ళల్లో ఉంచి బతుకమ్మ, కోలాటాలు ఆడినారు. ఆడుతూ పాడుతూ నిమజ్జనం చేశారు. అనంతరం మహిళలు సత్తిపిండిని ఒకరికి ఒకరు అందించుకొని బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# రాధాకృష్ణుల రథోత్సవం



**ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి ):** ఎల్లారెడ్డిపేట మండల రాచర్ల గొల్లపల్లి గ్రామానికి దసరా నవరాత్రి ఉత్సవాల భాగంగా గొల్లపల్లి గీతా మందిర రాధాకృష్ణ ఊరేగింపుగా గ్రామంలోని పురవీధుల గుండా రాధాకృష్ణ స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు కోలాటం వాడుతూ భజనలు చేస్తూ రథోత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమంలో రాచర్ల రఘురాం శర్మ వాళ్ళ రవీందర్ శర్మ నిర్వహించినట్లు తెలిపారు.

# ఎన్నికల కోడ్ అమల్లో జెండా గద్దెలు, పోస్టర్లు మూసివేత



**గంభరావుపేట అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** ఎలక్షన్ కోడ్ లో భాగంగా గంభరాపేట మండలంలో నర్మల గ్రామంలో వివిధ పార్టీల జెండా గద్దెలు పోస్టల్ లు స్థానిక అధికారులు మూసివేశారు.

## ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు




ఎవరైనా వ్యక్తులు ప్రైవేట్ ఆస్తులు కానీ ప్రభుత్వ ఆస్తులు గాని ధ్వంసం చేసి నష్టపరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఆస్తి నష్టాన్ని కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రజలు సంయమనం పాటించాలని కోనరావుపేట ఎస్సై కే ప్రశాంత్ రెడ్డి తెలిపారు

## కారును ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**కోనరావుపేట: అక్టోబర్.03(ప్రజా జ్యోతి):** కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన బండ రవి షిఫ్ట్ డిజైర్ కారును అదే గ్రామానికి చెందిన మేడుదుల కార్తీక్ అనే వ్యక్తి ఈ నెల 2 న రాత్రి ధ్వంసం చేశాడు. దీంతో కారు అద్దాలు, లైట్స్,కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయ్యాయని, సుమారు రూ.లక్ష నష్టం జరిగినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

## ఆపదలో ఉన్న తోటి మిత్రునికి ఆర్థిక సాయం

**ముస్తాబాద్ అక్టోబర్ 4( ప్రజా జ్యోతి ):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని 2001 2002 సంవత్సరానికి సంబంధించిన పదోవ తరగతి మిత్రులు అందరు కలిసి తమ తోటి మిత్రుడు కట్ట మహేందర్ కు కొన్ని రోజుల క్రితం బైక్ ఆక్సిడెంట్ కాగా విషయం తెలిసిన వెంటనే తోటి మిత్రులు అందరు కలిసి 20000 ల ఆర్థిక సాయం అందించారు మిత్రునికి ధైర్యంగా ఉండాలని తెలిపారు ఇలాగే ప్రతిసారి తోటి మిత్రులలో ఎవరికి ఎలాంటి ఆపద ఉన్న ముందుండి ఒకరికి ఒకరం తోడుగా ఉంటున్నామని తెలిపారు.





## మున్సిపల్ కమిషనర్ డి ఈ కి కృతజ్ఞతలు



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి ):** శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద వీధిలైట్లు వెలగకపోవడంతో సిరిసిల్ల మునిసిపల్ కమిషనర్ వీధిలైట్లు వెలగడం లేదని అభ్యర్థించగానే కమిషనర్ మరియు డి ఈ తక్షణమే స్పందించి లైట్లు ఏర్పాటు చేయడంతో సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి సభ్యులు హర్షిస్తు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సీతాఫలాల కోసం వెళ్లి వ్యక్తి మృతి

**ధర్మారం అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి న్యూస్):** మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కొంపెల్లి భూమయ్య ముదిరాజ్ (54) శనివారం మృతి చెందాడు. అతని మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. భూమయ్య తన కుటుంబాన్ని పోషించుకోవడానికి సీతాఫలాలు అమ్ముకుంటాడు. సీత ఫలాల కోసమని గుట్టకు వెళ్లిన భూమయ్య జారి పడి మరణించాడు.ఉదయం భీముని గుట్టకు సీత ఫలాలా కోసం వెళ్లి కొమ్మకు ఉన్న కాయలకోసం బండ పైకి ఎక్కి తెంపుతున్న క్రమంలో జారి పడి మరణించినట్లు స్థానికులు తెలిపారు. మృతుడు భూమయ్యకు భార్య తార,ఇద్దరు కుమార్తెలు సంతానం,పెద్ద కూతుర మానసకు వివాహం అయినది. రెండవ కూతురు రమ్య చదువుకుంటున్నది.నిరుపేద కుటుంబం ఇంటి పెద్దను కోల్పోవటం వలన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నిరయ్యారు.



# కాంగ్రెస్ జెడ్పిటిసి అభ్యర్థికి గెలుపు కృషి చేయాలి

**సద్ది లక్ష్మారెడ్డి....ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండలం కేంద్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నరసయ్య హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త సైనికుని వలె కృషి చేయాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గిరిధర్ రెడ్డి ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలను కోరారు .మండలంలోని ఒక జెడ్పిటిసి, 13 ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించుటకు కొరకు ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్ రెడ్డి అధిష్టానం టికెట్ ఎవరికి కేటాయించిన ప్రతి ఒక్కరు గెలుపు కృషి చేయాలని అన్నారు . గోగూరి శ్రీనివాసరెడ్డి ,నంది కిషన్, సుడిద రాజేందర్ , బండారి బాల్ రెడ్డి ,గొల్లపల్లి మల్లేశం, శంకర్ ,మందాటి దేవేందర్ ,కదిరి శ్రీనివాస్ గౌడ్, మహేందర్ ,మల్లారెడ్డి , లక్ష్మారెడ్డి ,శెట్టిపల్లి బాలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మత్తు పదార్థాల అనర్థాలపై విస్తృత ప్రచారం చేయాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** మత్తు పదార్థాల అనర్థాలపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో నిర్వహించవలసిన వివిధ కార్యక్రమాలపై మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు. అక్టోబర్ నెలాఖరు వరకు జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించాలని అన్నారు. పోలీస్, ఎక్సైజ్, డిఆర్డిఓ, మెప్మా, విద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, తదితర శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల మహిళలను ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగస్వామ్యులను చేయాలని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, మెడికల్ కళాశాలల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.మాదకద్రవ్య వ్యతిరేక సందేశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని అన్నారు. మాదకద్రవ్య రహిత భారత్ గురించి యువతకు వివరించేలా డ్రాయింగ్ కాంపిటీషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. పెద్ద ఎత్తున మారథాన్ నిర్వహించి మాదకద్రవ్యాల అనర్థాలపై ప్రజలకు సందేశం ఇవ్వాలని సూచించారు. సామూహిక ప్రతిజ్ఞ చేయించాలని, ప్రతిజ్ఞను సూచించే ఆన్లైన్ క్యూఆర్ కోడ్ ను జనసందోహం ఉన్నచోటల్ల ప్రదర్శించాలని సూచించారు.అనంతరం నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞకు సంబంధించిన క్యూఆర్ కోడ్ ను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఎన్ వై కే కోఆర్డినేటర్ రాంబాబు, నాకార్డ్ విభాగం సిఐ పుల్లయ్య, డిసిపిఓ పర్వీన్, సిడిపిఓ సబిత, విద్యాశాఖ కోఆర్డినేటర్ ఆంజనేయులు, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, ఎస్సై పాషా, నషా ముక్త్ భారత్ కమిటీ మెంబర్లు కేశవరెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.




# యదా సరస్వతి చూపు సజీవం...

**నేత్రదానం తో ఇద్దరు అందులకు చూపు..**

**సరస్వతి కుటుంబ సభ్యులను అభినందించిన సదాశాయ ఫౌండేషన్...**

**ఇల్లందకుంట, అక్టోబర్4 (ప్రజాజ్యోతి) :** తాను మరణించిన తన కండ్లు మరొక ఇద్దరికి చూపును ఇవ్వాలని ఆమె కోరిక మేరకు ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన యాద సరస్వతి ఆదర్శప్రాయురాలు అని సదాశాయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి అభినందించారు. శుక్రవారం సాయంత్రం సరస్వతి ( 45 ) గుండెపోటుతో మృతి చెందారు. సరస్వతి మృతి విషయాన్ని బంధువుల ద్వారా సమాచారం తెలుసుకున్న మచ్చగిరి నరహరి జిల్లా సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు నేత్రదానంపై వారి కుటుంబసభ్యులకు శనివారం అవగాహన కల్పించడంతో కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించినారు. సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మచ్చగిరి నరహరి ఆధ్వర్యంలో, వరంగల్ ఎల్వి ప్రసాద్ టెక్నీషియన్ లక్ష్మణ్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ పంపడంజరిగింది.ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన , భర్త యాద వీరన్న, కుటుంబ సభ్యులను అభినందించి ప్రశంస పత్రం అందించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి,ముఖ్య సలహాదారులు నూక రమేష్, గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి,ప్రచార కార్యదర్శి వాసు, లగిశెట్టి చంద్రమౌళి పాల్గొని బంధుమిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.



# ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి అక్టోబర్ 4( ప్రజా జ్యోతి)**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత రాజన్న సిరిసిల్ల బోయినపల్లి మండలంలోని కోదురుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రా న్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించినారు. ఈ తనిఖీలలో హాజరు రిజిస్టర్ను, కేంద్ర ఆరోగ్య పథకాల పలు రికార్డులను పరిశీలించి, వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాల్సిందిగా లేనియెడల సి ఏ ఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని, రక్త పరీక్ష ల్యాబ్ ను పరిశీలించి సకాలంలో జిల్లా కేంద్ర తెలంగాణ ల్యాబ్ కు పంపించవలసి ందిగా మరియు0-5 సంవత్సరాల వ్యాధి నిరోధక టీకాల( వ్యాక్సిన్) నిలువలను, మందుల నిల్వలను పరిశీలించి వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య సేవలు అందించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రేణు ప్రియాంకకు సూచిస్తూ, ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సాధించవలసిందిగా సూచనలు సలహాలు అందించడం జరిగిందన్నారు

# మహిళలు,విద్యార్థినిలు సమస్య ఉంటే సంప్రదించండి

**సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దు.**

**మహిళలను వేధిస్తున్న పోకిరీలపై గత నెలలో 04 కేసులు ,03 పెట్టి కేసులు నమోదు.**

**మహిళలు,విద్యార్థినిలు వేధింపులకు గురైతే షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో చట్టపరమైన చర్యలు**

**జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపిఎస్**



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి)**
విద్యార్థినులు,మహిళలు వేధింపులకు గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గారు భరోసా ఇచ్చారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లాలో షీ టీమ్ బృందం విద్యాసంస్థల్లో,మహిళలు పని చేసే ప్రదేశాల్లో ర్యాగింగ్,ఇవిటీజింగ్,పొక్సో,షీ టీమ్స్, మహిళ చట్టలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గత నెలలో షీ టీమ్ కు వచ్చిన ఫిర్యాదులలో 04 ఎఫ్ ఐ ఆర్ లు, 03 పెట్టి కేసులు నమోదు చేసి మహిళలను,విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి వారియెక్క తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు.

విద్యార్థినులు, మహిళలు అభద్రత బావనికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీం కి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో మహిళల, విద్యార్థినిల రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందని ప్రధానంగా మహిళలు, విద్యార్థినిలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని,ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో పరిచమయమ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం వుండాలని సూచించారు. మహిళలు తాము పనిచేసే ప్రదేశాల్లోగాని,మరేక్కడ్కెన ల్కెంగిక వేధింపులకు గురౌవుతున్న,ర్యాగింగ్ లాంటి వేధింపులకు గురౌవుతున్న మహిళలు,విధ్యార్థునులు,బాలికలు మౌనంగా ఉండకుండా, ధ్కెర్యంగా పిర్యాదు చేయాలని సూచించారు.ఎవరైనా ఆకతయులు మహిళలను,యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాసంస్థలల్లోఎవరైనా వేధించిన,రోడ్డుపై వెళ్లేటప్పుడు,పని చేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనేజిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపారు.

# మోదీ సాహసోపేత నిర్ణయాలతో సురక్షితంగా దేశం

**-కాంగ్రెస్ పార్టీని బొందపెట్టడానికి ప్రజలు సిద్దం..**


**-స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుస్తాం..**

**-బిజెపి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి..**



**పెద్దపల్లి జిల్లాప్రతినిధి అక్టోబర్04(ప్రజాజ్యోతి):**
భారతువైపు శత్రుదేశాలు కన్నెత్తి చూడటానికే భయపడేలా చేసిన దేశప్రధాని నరేంద్రమోదీ చేతుల్లో దేశం సురక్షితంగా ఉందని మోదీ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలే దేశాన్ని బలమైనశక్తిగా నిలబెట్టాయని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఉద్ఘాటించారు. స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ, రాబోయే స్థానిక ఎన్నికల్లో పెద్దపల్లి జిల్లాలో అత్యధిక సర్పంచి, ఎంపిటీసి, జడ్పిటీసి స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని తెలిసే హడావుడిగా ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన 6గ్యారెంటీలు, 420 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలోని వృద్దులు, వితంతువులు, మహిళలు, యువతను కాంగ్రెస్ పార్టీ ఘోరంగా మోసం చేసిందని విమర్శించారు. యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అవినీతిలో కూరుకుపోయారని, అక్రమకేసులు పెట్టి బిజెపి కార్యకర్తలను జైళ్ళకు పంపుతున్నారని ఆగ్రహించారు. చర్యకు ప్రతిచర్య తప్పదని స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావుపై నేరుగా మాటలదాడి చేశారు. బిసిలపై కపటప్రేమను కురిపించి రిజర్వేషన్ల అంశానికి ఎగనామ పెట్టారని, బిసిల నుండి వచ్చే ప్రతిఘటనను తప్పించుకోవడానికే పార్టీలో బిసిల రిజర్వేషన్ల నాటకానికి తెరలేపారని ఎద్దేవా చేశారు. పార్టీలో గ్రూపులు, వర్గాలకు తావులేదని, కష్టపడ్డవారికి, గెలుపు గుర్రాలకు టికెట్ దక్కుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో కమలం జెండాను ఎగురవేయబోతున్నామన్న వారు ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు దగ్గరుండి ప్రచారం చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు మీస అర్జునరావు, గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, ఠాకూర్ రాంసింగ్, నల్లా మనోహరరెడ్డి, గంటల రమణారెడ్డి, మేరుగు హనుమంతు గౌడ్, శిలారపు పర్వతాలు, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, కడారి అశోక్ రావు, కోమల్ల మహేష్, కన్నం అంజయ్య, గుర్రాల వీరేశం, అమరగాని ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేత మృతిపై 'చెల్మెడ' సంతాపం



**వేములవాడ, అక్టోబర్ 4:**
వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వార్డుకు చెందిన మాజీ గ్రామ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త వేములవాడ (కమ్మరి) శ్రీనివాస్(47) గుండెపోటుతో మృతిచెందగా, వారి భౌతిక కాయానికి శనివారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ మృతిపై సంతాపం వ్యక్తం చేసి, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి, మనోధైర్యం నింపారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అంటే ప్రాణమని శ్రీనివాస్ చెప్పేవాడని, గుండెపోటుతో అకాల మరణం చెందడం చాలా బాధాకరం అన్నారు. శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. వారి వెంట జిల్లా పార్టీ అధ్యక్షులు తోట ఆగయ్య, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, నాయకులు నీలం శేఖర్, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మ శెట్టి విజయ్, జోగిని శంకర్ తదితరులు ఉన్నారు.

## గాంధీ ఇన్స్పిరేషనల్ జాతీయ పురస్కారం

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి)**



గాంధీ జయంతి సందర్భంగా గాంధీ ఫెలోషిప్ సంస్థ వారు గాంధీ ఇన్స్పిరేషనల్ జాతీయ పురస్కారాన్ని డాక్టర్ కందేపి రాణీప్రసాద్ కు ప్రకటించారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసురాలు గాంధీ గారితో కలిసి నడచిన క్రీ.శే అంగలకుదిటి సుందరాచార్యులు గారి కుమార్తెగా కస్తూరిబా గాంధీ పిల్లల నవల రచయత్రిగా గాంధీ చిత్రాలను రూపొందించిన చిత్రలేఖకురాలిగా డాక్టర్ కందేపిరాణీప్రసాద్ ఈ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. స్వాతంత్ర అమృత్యోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని రాణీ ప్రసాద్ స్వాతంత్రానికి సంబంధించి 75 చిత్రాలను తయారు చేశారు అందులో స్వాతంత్రోద్యమ కవితలు స్వాతంత్ర అమరవీరుల చిత్రాలు జాతీయ పతాకాలు భారతదేశ చిత్రపటాలను తయారుచేసి రెండు ఎగ్జిబిషన్ సైతం నిర్వహించారు. ఈ పురస్కారం విషయమై రాణీ ప్రసాద్ ను సంప్రదించగా తాను దక్షిణాఫ్రికాలో గాంధీజీ నివసించిన జైలులో వారు అనుభవించిన కష్టాలను చూసి తెలుసుకున్న విషయాలను గాంధీ గారిని రైలులో నుండి తెల్లదొరలు తోపివేసిన దర్బన్ రైల్వే ప్లాట్ఫారంను చూసిన విషయాలను జ్ఞాపకం తెచ్చుకున్నారు. గాంధీజీ గురించి స్వాతంత్ర వీరుల గురించి చాలా రచనలు చిత్రాలు అందించిన డాక్టర్ కందేపి రాణీప్రసాద్ ఈనెల 5వ తేదీన హైదరాబాదులో పురస్కారాన్ని అందుకోనున్నారు

## చేరికలు

**గోదావరిఖని, అక్టోబర్ 4(ప్రజా జ్యోతి)**



బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.శనివారం గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అంతర్గాం మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు గీట్ల శంకర్ రెడ్డి,మాజీ సర్పంచ్ కుర్ర నూకరాజుకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని,రానున్న పరిషత్,గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మడ్డి వెంకటేష్ గౌడ్,కాంపెల్లి సంతోష్, బొంతల రాజేష్,దీటి బాలరాజు,మారెల్లి రాజిరెడ్డి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం బస్తా అందజేసిన అడ్వకేట్



ధర్మారం అక్టోబర్4 (ప్రజాజ్యోతి): మండలంలోని బొట్లవనపర్తి గ్రామ పురోహితుడు ముల్కల వీర బ్రహ్మచారి తల్లి ముల్కల కమల ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబానికి అడ్వకేట్ ఆకారి రాజేశం ప్రగాఢ సానుభూతి తెలియజేసి పరామర్శించారు.బాధిత కుటుంబానికి 25కిలోల బియ్యం బస్తా అందజేసారు. అడ్వకేట్ వెంట కరోబార్ రెడపాక రమేష్,డా. ఏం.రాము ఉన్నారు.

## రామాలయంలో వైభవంగా శాంతి కల్యాణం

**దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు**



ఇల్లందకుంట,అక్టోబర్4 (ప్రజాజ్యోతి): ఇల్లందకుంట లోని అపర భద్రాద్రిగా శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాలలో భాగంగా గ్రామ దేవాలయం నందు నిత్య కళ్యాణం కార్యక్రమం తో ఉత్సవాలు ముగిశాయని ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. శనివారం అర్చకులు వంశిధరచార్యులు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిత్య కల్యాణం పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అన్నదానం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు కిరణ్ ,రాంరెడ్డి జూనియర్ అసిస్టెంట్ మల్లారెడ్డి, ఆలయ సిబ్బంది రాజు గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## రిటైర్డు ఉద్యోగుల ఊసురుపోసుకుంటున్న రాష్ట్రప్రభుత్వం

**-పెన్షనుకోసం ఏడాదిన్నరగా ఎదురుచూపులు..**

**-7న కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయండి..**

**-రేవా ఉమ్మడి జిల్లాధ్యక్షుడు కొహెడ చంద్రమౌళి..**



పెద్దపల్లి జిల్లాప్రతినిధి అక్టోబర్04(ప్రజాజ్యోతి) పదవివిరమణ చేసిననాడే ఉద్యోగ ప్రయోజనాలు ఉద్యోగి ఖాతాలో జమచేయాలని చట్టాలు చెబుతున్నా పాలకులు మాత్రం రిటైర్డు ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని రిటైర్డు ఉద్యోగుల సంక్షేమసంఘం ఉమ్మడి జిల్లాఅధ్యక్షుడు కొహెడ చంద్రమౌళి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2004లో పదవివిరమణ చేసిన ఉద్యోగులకు ఏడాదిన్నరగా రిటయిర్మెంట్ బెనిఫిట్లు మంజూరు చేయకుండా ప్రభుత్వం జాప్యం చేయడం అన్యాయమని అన్నారు. గ్రాట్యుటి, కమ్యూటేషన్, జిపిఎఫ్, జిఐఎస్, నగదు సెలవులు వంటి సదుపాయాలు పెండింగులో ఉన్నాయని వాపోయారు. గ్రాట్యుటీ కింద కేంద్ర ప్రభుత్వం రూ.20లక్షలు ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.16లక్షలు చెల్లించి చేతులు దులుపుకోవడం పట్ల అభ్యంతరం తెలిపారు. పదవివిరమణ ప్రయోజనాలు అందుతాయోలేదోనన్న బెంగతో పలువురు రిటైర్డు ఉద్యోగులు మనోవ్యధకు గురై చనిపోయారని నిస్సహాయత వ్యక్తం చేశారు. 17నెలలపాటు నెలవారిగా డిఏ చెల్లిస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం 3నెలలు మాత్రమే చెల్లించి మోసం చేసిందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించాలని లేనిపక్షంలో ఉద్యమబాటను చేపట్టవలసి ఉంటుందని హెచ్చరించారు. దీనిలో భాగంగా ఈనెల 7న ఉమ్మడి జిల్లాల్లో కలెక్టరేటుల ముందు జరిగే నిరసన ప్రదర్శనలో రిటైర్డు ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని చంద్రమౌళి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి సుంకిచర్ల ప్రభాకరరావు, కోశాధికారి కనపర్తి దివాకర్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు నరెడ్ల వెంకట్ రెడ్డి, కోడం వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీవన్‌లో బొగ్గు ఉత్పత్తి,ఉత్పాదకత,రవాణా పై సమీక్ష



గోదావరిఖని , అక్టోబర్ 4(ప్రజా జ్యోతి) సింగరేణి ఆర్జీ1 జియం కార్యాలయంలో బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత రవాణా తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.శనివారం ఆర్జీ1 జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి అన్ని డిపార్ట్ మెంట్ అధికారులు ప్రాజెక్టు ఆఫీసర్,ప్రాజెక్టు మేనేజర్,ప్రాజెక్టు ఇంజనీర్స్,అన్ని గనుల ఏజెంట్లు,మేనేజర్స్ వివిధ విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఆర్జీ1 ఏరియాకు సంబందించిన ఉత్పత్తి,ఉత్పదకత, రవాణా,సంక్షేమం పై జిఎం సమీక్షించారు.ఆర్జీ1 లో కీలక పనుల పురోగతి,ప్రస్తుత స్థితి చేపట్టబోవు పనుల వివరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరణాత్మకమైన నివేదికతో పాటు పలువురి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకున్నారు.ఖర్చు తగ్గింపు,పని విధానంలో మెరుగుదల,ఉత్పత్తి,ఉత్పాదకతా పెంచడం,బొగ్గు నాణ్యతలో మెరుగుదల,భద్రతా చర్యలను బలోపేతం చేయడం,బ్యాలెన్స్ బొగ్గు నిల్వలను ఆర్థికంగా వెలికితీసేందుకు మూసివేసిన గనులను తిరిగి తెరవడానికి చొరవ తీసుకోవడం,పర్యావరణ మెరుగుదల కాలుష్య నియంత్రణ కోసం ప్రయత్నాలు,రక్షణకు మొదటి ప్రాధాన్యత,క్రమశిక్షణ మెరుగుదల చర్యలు,ఉత్పత్తి,భద్రత,నాణ్యత పని వాతావరణం కోసం వినూత్న ఆలోచనలు చేయాలనీ జిఎం సూచించారు.ఈ సమావేశంలో యస్.ఓ.టు జిఎం చంద్రశేఖర్,ఏజంట్స్ చిలుక శ్రీనివాస్,యల్ రమేష్,ప్రాజెక్ట్ అధికారి రమేష్,ఏరియా రక్షణ అధికారి సాయి ప్రసాద్,అధికారులు శివ నారాయణ,రాందాస్,వేణు, సాంబశివరావు,సియస్.పి యస్.ఇ ఫైడిశ్వర్,సర్వే అధికారి లక్ష్మి రాజు,క్రాంతి పాల్గొన్నారు.

# వాహనాల ట్యాక్స్ చెల్లించాలి

**సోమవారం నుంచి ప్రత్యేక తనిఖీలు చేస్తాం**

**జిల్లా ఇంచార్జి రవాణా శాఖ అధికారి వంశీదర్**



రాజన్న సిరిసిల్ల అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి ) జిల్లాలో సరుకు, ప్రయాణికులను చేరవేసే వాహనాలకు సంబంధించిన 4,419 గల వాహనాల యజమానులు పన్ను చెల్లించాలని జిల్లా ఇంచార్జి రవాణా శాఖ అధికారి వంశీదర్ ఒక ప్రకటనలో సూచించారు. ఆయా వాహనాలు రోడ్డు టాక్స్ కట్టకుండా వినియోగిస్తున్నారని తెలిపారు సిరిసిల్ల డివిజన్ కు సంబంధించి 2,787 వాహనాలు, వేములవాడ డివిజన్ కి సంబందించి 1,632 వాహనాలు ఉన్నాయని వెల్లడించారు. అలాగే ఫిట్ నెస్ సర్టిఫికెట్ లేకుండా జిల్లాలో 11,425 వాహనాలు తిరుగుతున్నాయని తెలిపారు. సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ లో 6,647, వేములవాడ డివిజన్ లో 4778 ఉన్నట్టు రికార్డ్ లో ఉందని పేర్కొన్నారు. ట్యాక్స్, ఫిట్ నెస్ సర్టిఫికెట్ లేని వాహనాల యజమానులు ట్యాక్స్ చెల్లించి ఫిట్ నెస్ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 6 వ తేదీ సోమవారం నుంచి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసులు బుక్ చేసి సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

# కాన్షీరాం వర్ధంతిని జయప్రదం చేయాలి

**కర పత్రాలు విడుదల చేసిన నాయకులు**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 04:(ప్రజా జ్యోతి) ఈనెల 9న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో నిర్వహించే కాన్షీరాం 19 వర్ధంతిని పార్టీ శ్రేణులు,బహుజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా ఇంచార్జి వరికిళ్ళ మల్లేష్,జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల రాజనర్సయ్య పిలుపునిచ్చారు.పెద్దపల్లి జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం వర్ధంతి కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికార ప్రదాత,బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని కోరారు. బహుజనులను రాజకీయంగా చైతన్యం చేసి అధికారం వైపు నడిపి ఉత్తరప్రదేశ్ లో బీఎస్పీని అధికారంలోకి తెచ్చి అట్టడుగు వర్గాలకు మేలు చేసిన వ్యక్తి కాన్షీరాం అని కొనియాడారు.భారత రాజకీయ యుద్ధభూమిలో ఓట్లు మావి సీట్లుమీవా అనే నినాదంతో మనువాదుల గుండెల్లో వణుకుపుట్టించి బహుజనుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన మహనీయుడు కాన్షీరాం అని గుర్తు చేశారు.కాన్షీరాం వర్ధంతి కార్యక్రమానికి పార్టీ నాయకులు,కార్యకర్తలు,బహుజనులందరు హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు గొట్టే రాజు,జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు,మంథని నియోజకవర్గ ఇంచార్జీ జనగామ రవికుమార్,రామగుండం అసెంబ్లీ ఇంచార్జి జింక ఉదయ్,పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య,ప్రధాన కార్యదర్శి సాతురి అనిల్,తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆర్జీ1 ఎస్ ఓ టూ జీఎంగా చంద్రశేఖర్



గోదావరిఖని , అక్టోబర్ 4(ప్రజా జ్యోతి) సింగరేణి ఆర్జీ1 ఎస్ ఓ టూ జీఎం గా చంద్రశేఖర్ నియమితులయ్యారు.జీడీకే-5 ఓసీపీ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన చంద్రశేఖర్ బదిలీపై కార్పొరేట్ కు వెళ్లారు.ఆర్జీ-1 యస్.ఓ.టు జి.యం గా పని చేసిన గోపాల్ సింగ్ జియంగా పదోన్నతి లభించడంతో ఇన్ని రోజులు ఎస్ ఓటు జిఎం పోస్టు ఖాళీగా ఉండిపోయింది.దీంతో యాజమాన్యం చంద్రశేఖర్ ను ఎస్ ఓ టు జియంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఆర్జీవన్ జిఎం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ కు పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు,ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.శాలువా కప్పి సత్కరించారు.పుష్పగుచ్చం అందజేశారు.ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ యం.రవీందర్ రెడ్డి,డివై పియం వేణు,శ్రావణ్ కుమార్,ఫిరోజ్ ఖాన్,ఆఫీస్ సూపరిండెంట్ దేవాచారి,అన్వేష్,దివ్య రెడ్డి,అనిత,సంతోష్, వెంకటేష్ పాల్గొన్నారు.